
# కోమలి హృదయం




*యోగ్యుడు. అందగాడుకూడా. కాని గుమాస్తాగిరి వెలగబెట్టుతున్నాడు. ఆమె వైద్య విద్యార్థిని. ఎంత తాళి గట్టినా 'భర్త' అని అంగీకరించడం మాట అటుంచి, చెప్పుకోవడం సహితం ఎంత కష్టం!*

కిళాంబి శేషావతారం

**లో**పలకు వస్తూన్న కుమార్తెను చూసి "కమలా" అని పిలిచారు రాఘవేంద్రంగారు.

వెంటనే కమల నాన్నగారి గదిలోనికి వెళ్ళి, "మీరు ఊరినుంచి యెప్పుడు వచ్చారు, నాన్నా!" అన్నది.

"ఇప్పుడే వచ్చానమ్మా. ఈ వేళ వెంటనే వచ్చేశావేం?" అన్నారు.

"ఆఖరు పీరియడు లీజర్."

"చూడమ్మా! నిన్న రవీంద్రుని కలుసుకున్నాను. ఈ సంక్రాంతి పండుగకి తప్పక రమ్మని మరీమరీ చెప్పాను. చంద్రాన్ని కూడ తీసుకు

రమ్మన్నాను. ముందుగా రావడానికి వీలుపడదు అన్నాడు. కానీ అతి కష్టం మీద ఒప్పించాను" అని ఒకసారి కుమార్తె ముఖ కవళికలు పరీక్షించారు.

ఇంతవరకు సంతోషంతో, నవ్వుతో వెలుగుతూన్న కమల వదనం ముకుళించుకుపోయింది. రాఘవేంద్రంగారు ఈ విషయం ముందే ఊహించారు. ఒకసారి గొంతుకను సవరించుకొని, "ముందు అతడు ఎందుకు రానన్నాడో తెలుసా? నువ్వు నిరుడు సంక్రాంతికి చేసిన అవమానం ఇంకా మరిచిపోలేదు. రవీంద్రుడు ఈ విషయం చెప్పక పోయినా, నేను గ్రహించాను. రవీంద్రుని హృదయం చాలా సున్నితం. నిన్ను ఎం. బి. బి. ఎస్. చదివించడానికి ప్రోత్సాహం చేసింది ఎవరో నీకు బాగా తెలుసు" అని కొన్ని క్షణాలు ఆగి, "చూడమ్మా, కమలా! నీకు నేను వేరే చెప్పనక్కర్లేదు. మీ అమ్మకాని బ్రతికిఉంటే ఇలా ఎన్నటికీ జరిగేది కాదు. ఒక్క విషయం మాత్రం మరిచిపోవద్దు కమలా! రవీంద్రుడు నీ భర్త... అతణ్ణే....."

ఇంకా వాక్యం పూర్తిచేయకుండానే కమల అక్కడినుంచి వేగంగా వెళ్లిపోయింది. రాఘవేంద్రంగారు మనసులోనే కుమిలిపోయారు. కమల తిన్నగా గదిలోకిపోయి పరుపు మీద వాలిపోయింది. తన మెడలోని మంగళసూత్రం తనను చూసి వికటాట్టహాసం చేస్తున్నది. తన అధఃపతనానికికుమిలిపోతున్నది. నిరుటిసంక్రాంతికి జరిగిన సంఘటనలు కమల ముందు మెదలసాగాయి...

గది తలుపు ముందు పాదాల ధ్వని విని తన చేతిలోని పుస్తకాన్ని అడ్డుతీసి చూసింది. ఇంకెవరో కాదు. నెమ్మదిగా లేచి నిలుచున్నది. అతడి నోటినుండి లాలనగా "కమలా!" అన్న పిలుపు వచ్చినది.

తనుమాత్రంకొంచెంకరుకుగానే"ఎందుకూ?" అన్నది. తన ప్రవర్తనకు కొంచెం అతడు ఆశ్చర్యపడిన విషయం తను గ్రహించకపోలేదు.

తన చేతిలోని బంగారు ఉంగరం చూపించి, "పండుగ బహుమానం, కమలా!" అన్నాడు.

తను ఏమాత్రం జంకకుండా, "థాంక్స్! నాకు చాలా ఉంగరాలున్నాయి" అని వెంటనే వెళ్లిపోయినది.

ఆ సాయంకాలమే తన స్నేహితురాలు లత ఇంటికి వచ్చింది. హాలులో ఉన్నవారిని చూపించి "ఎవరు, కమలా?" అని ప్రశ్నించినది.

"నాకు తెలీదు... మా నాన్నగారి స్నేహితుడై ఉండవచ్చును" అన్నది కొంచెం గట్టిగానే.

అర్ధ్రాత్రి నాన్నగారు కోపంగా, "ఏం, కమలా!, రవీంద్రు డెవరో నీకు తెలీదేం? భర్త అని చెప్పుకోవడానికి అంత సిగ్గు దేనికి? పైగా గట్టిగా అనడంలో నీ ఉద్దేశ్యం?" అన్నారు.

"మీకు వినిపించాలనే అలా అన్నాను."

నాన్నగారు ఆశ్చర్యపోయారు. "ఏమిటి కమలా!" అన్నారు.

# కోమల హృదయం

"గుమస్తాగిరీ వెలగిస్తూన్న ఆయన్ని నా భర్త అని చెప్పి నన్ను నేను హీనపరుచుకోలేను నాన్నా!" కంఠధ్వనిలో బాధ, రోదన సమ్మిళితమై ఉన్నాయి.

నాన్నగారు విభ్రాంతి చెందినారు. వెంటనే కోపం పెల్లుబికి రాగా ఏదో అనబోయారు.

ఇంతలో రవీంద్రుడు అక్కడకు వచ్చి, "నేను వెళ్తున్నానండీ" అన్నాడు.

నాన్నగారు కరిగిపోయారు. "ఎక్కడకు రవీంద్రా?" అన్నారు.

"ఇంటికి."

"అదేమిటి రవీంద్రా? పండుగకని వచ్చి అప్పుడే వెళ్లిపోతావా?" అన్నారు ప్రాధేయపడుతున్నట్లు.


"నా రాక కమలకు ఇంత బాధ కలిగిస్తుందను కోలేదు. కమల అన్నమాటలలో వాస్తవంలేక పోలేదు. ఎం. బి. బి. ఎస్. చదువుతూన్న విద్యార్థిని, కేవలం ఒక చిన్న గుమాస్తా ఉద్యోగం చేస్తున్న వానిని భర్త అని ఎలా చెప్పుకోగలుగుతుంది. నన్ను క్షమించండి" అంటూ వెళ్లిపోయాడు.

రాఘవేంద్రంగారు ఎంత పిలిచినా వినిపించుకోలేదు. నిస్పృహతో ఒక నిశ్వాసం విడిచి, "ఎంత పని చేశావు, కమలా?" అన్నారు. అంతకన్నా ఇంకేమీ అనలేకపోయారు.

గత చరిత్ర అంతా రీలువలె దొర్లి ఆగిపోయినది. ఒకసారి మంగళసూత్రం వైపు చూసుకున్నది. అది కాలసర్పంలా బుసలు కొడుతున్నట్లున్నది.

## 2

మూడు రోజుల క్రితమే వస్తానన్న రవీంద్రుడు ఇంకా రాకపోవడంతో రాఘవేంద్రంగారి మనస్సు ఆందోళన పడసాగినది. ఈ విషయం



లీరిక వేళ

చిత్రం—వి. కృష్ణవేణు (మద్రాసు-17)

గురించే కుమార్తెతో కూడా చెప్పారు. "ఏదైనా జరూరు పనుండేమో!" అంటూ కమల నసిగింది. "అవును. అదే కారణమై ఉండవచ్చును. రేపు తప్పక వస్తాడు" అని నిశ్చయించుకున్నారు రాఘవేంద్రంగారు.

కమల, తన స్నేహితురాలితో కలిసి పబ్లిక్ గార్డెన్స్‌కు వెళ్లింది. ఇద్దరూ ఒక తిన్నెపై కూర్చున్నారు. ఆ ప్రదేశమంతా రామణీయకం పొంగులువారుతున్నట్లున్నది. అందమైన పుష్పాలు చల్లని పిల్ల గాలుల కెరటాలకు కులుకుగా తలలు పంకిస్తున్నాయి. ఫౌంటెన్స్ లలో నుంచి నీరు అందంగా పైకి విరజిమ్మబడుతున్నది.

తన ప్రక్కనుంచే వెళ్తున్న రవీంద్రుని చూడడంతో కమల హృదయం గతుక్కుమన్నది. అప్రయత్నంగా లేచి నిలుచున్నది. రవీంద్రుడు కూడా ఇదే పరిస్థితిలో నిలబడిపోయాడు. ఇరువురి మధ్యా కొన్ని క్షణాలు నిశ్శబ్దం ఆవరించినది.

ముందుగా కమలే పలకరించింది–"ఎప్పుడు వచ్చారు?" అని.

రవీంద్రుడు తడుముకోకుండా, "ఈ ఉదయమే మెయిలులో వచ్చాను" అన్నాడు.

వెంటనే అతడి ప్రక్కనే ఉన్న స్నేహితుడు "కాదండీ.. ఆ ప్పుడే రెండురోజులైనది" అన్నాడు.

"నాన్నగారు కులాసాయేనా?" అన్నాడు. రవీంద్రుడు... "ఆ!" అంటూ తలూపినది.

ఇంకేమీ పలకరించకుండా కొంతదూరం వెళ్లి మళ్లీ తిరిగి వచ్చి, "చూడు కమలా! నేను స్నేహితుని పెళ్లికని వచ్చాను. ఈ వాళ మెయిలులో వెళ్లిపోతున్నాను. వేళా వచ్చినట్లు మీ నాన్నగారితో చెప్పకు" అని సమాధానంకోసం నిరీక్షించకుండా వెళ్లిపోయాడు.

"ఎవరు కమలా?" అని ప్రశ్నించినది స్నేహితురాలు. కమల సమాధానమీయలేదు.

"చాలా అందంగా ఉన్నాడు. కొంపతీసి ప్రేమించడంలేదుకదా?" అన్నది నవ్వుతూ.

కమల దానికి సమాధానమీయకుండా "పద... పోదాం" అన్నది. కమల కనులలోని నీటి బిందువులను స్నేహితురాలు గుర్తించలేదు.

* * * *

లోపలకు వస్తున్న కమలను చూసి, "చూడమ్మా కమలా! రవీంద్రుడూ ఇన్ని రోజులైనా రాలేదు. కనీసం ఉత్తరమైనా వ్రాయలేదు. అతని కేమైనా జ్వరంకానీ వచ్చిందేమో! నేను ఒకసారి విశాఖపట్టణం వెళ్లి..." అన్నాడు రంగనాథంగారు.

"అంత అర్జంటుగా యెందుకు నాన్నా?" అన్నది నసుగుతూ. "నీకు తెలీదమ్మా, అతనికి అక్కడ ఎవ్వరున్నారు చెప్పు?"

కమల ఇక నిజాన్ని దాచలేకపోయినది. "నిన్న

ఆయన కనిపించారు నాన్నా" అన్నది.

రాఘవేంద్రంగారు ఆత్రుతగా, "ఎక్కడ కమలా?" అని ప్రశ్నించారు. ఒక్క ఆత్రుతే కాదు; సంతోషం, ఉత్సాహం కూడా ఆ కంఠంలో స్పష్టంగా వ్యక్తమౌతున్నాయి.

"పబ్లిక్ గార్డెన్స్‌లో..."

రాఘవేంద్రంగారు ఒకసారి అనుమానంగా కమలవైపు చూసి, "మళ్ళా నువ్వు అవమాన పరచలేదు కదా?" అన్నారు.

కమల మనసులో బాధపడి, "లేదు నాన్నా" అని రెండు క్షణాలాగి "అప్పుడే వచ్చి రెండురోజు లైందట. ఈవాళ మెయిలులో వెళ్తానన్నారు" అన్నది.

"ఇక్కడికి రాకుండా వెళ్లిపోదామను కుంటున్నాడా!.. ఇంకా మెయిలుకు టైము ఉంది" అని ఒక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా వెళ్లిపోయారు.

"అప్రయత్నంగా తను నిజాన్ని ఎందుకు చెప్పాలి?" అని తన మనసును తానే ప్రశ్నించు కున్నది కమల ఎందుకో!! క్రింద కారు హారన్ వినిపించినది.

## 3

రవీంద్రుడు కళ్ళు మూసుకున్నాడన్న మాటేగాని, నిద్ర రావడంలేదు. అతడి మన సులో పెద్ద సందేహం అలుముకున్నది. కమల ఈ విషయం రాఘవేంద్రంగారితో ఎందుకు చెప్పాలి? చెప్పదన్న ధైర్యంతోనే తనూ నిజం చెప్పాడు. ఇలా వెళ్ళుతున్నట్లు చెప్పకుండా ఉంటే రైలులో ఈ సమయానికి హైదరాబాదుకు ఎంత దూరమయ్యేవాడో? స్టేషనులో పరాకుగా ఉండటంవలన రాఘవేంద్రంగారి దృష్టి నుంచి తప్పించుకోక పోయాడు. తన రాక కమలకు బాధ కలిగించవచ్చు. అయినా తనుమాత్రం ఏం చేయుగలడు? అలా ఆలోచించుకుంటూ ఉండి పోయాడు. ఆ ఆలోచనలోనే గత స్మృతులు దొర్లుకు పోసాగాయి.

రాఘవేంద్రంగారు కాకినాడలో ప్రసిద్ధి కెక్కిన న్యాయవాదులలో ఒకరు. మంచి పలుకు బడి ఉండేది. తన నాన్నగారికి, రాఘవేంద్రం గారికి మంచి పరిచయం ఉండేది. వారి స్నేహం శాశ్వతంగా ఉండిపోవడానికిగాను తనకు, ఆయన కుమార్తె కమలకు వివాహం జరిగిపోయింది. అప్పుడు తను స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. కమల ఫోర్తుఫారం చదువుతున్నది.

తనకు స్కూల్‌ఫైనల్ క్లాసు పరీక్షలలో మంచి మార్కులు వచ్చేవి. అంతా తనకే స్కూల్ ఫస్టు వస్తుందను కున్నారు. అయితే దురదృష్ట వంతుడిని ఎవరూ బాగుపరచలేరు. బురదలో కూరుకుపోతున్న వాడికి దయతలచి ఎవరైనా చేతిని సాయంగా ఇస్తే, ఇవతలి వ్యక్తి కూడా బురదలో పడుతాడు. ఒక్క పడడమే కాదు; పడి కూరుకుపోతాడు కూడా! ఆ రోజు లెక్కల పేపరు. పేపరు కొంచెం కష్టంగా ఉన్నట్లుంది. తన వెనక బెంచీలోవాడు దీనంగా ముఖంపెట్టి సహాయం చేయమని వేధించడం మొదలు పెట్టాడు. తను దయతలచి ఏవో మూడులెక్కలు చూపించాడు. ఇది గమనించాడు కర్కోటకుడైన వాచర్. ఫలితం ఒక సంవత్సరం డిబార్. దానితో చదువు రెండు సంవత్సరాలు వెనక్కు పడింది.


తర్వాత ఇంటర్మీడియేట్‌లో చేరాడు. కమల కూడా అదే క్లాసు. కానీ, గ్రూపు వేరు. క్లాసులో మంచి మార్కులు వచ్చేవి. ప్రతి లెక్చరర్ కూడా తనంటే ఇష్టం చూపేవాడు. యూనివర్సిటీ ఫస్టు వస్తాడని అనుకొనేవారు. ఒక్క చదువులోనే కాదు—సాహిత్య సాంస్కృతిక కార్యకలాపాలలోను ప్రథముడుగా వచ్చేవాడు. యూనివర్సిటీ పరీక్షలు మొదలు పెట్టారు. ఇంగ్లీషు, తెలుగు అయిపోయాయి. లెక్కల పేపరు వ్రాస్తూ ఉండగా టెలిగ్రాం వచ్చింది, నాన్నగారు పోయారని. కలం ముందుకు నడవ లేదు. పేపరు వ్రాయకుండానే గదికి వచ్చేశాడు. కమలకు ఈ విషయం తర్వాత తెలిసినది. తనతో కమల కూడా వస్తానన్నది. తనే అతికష్టం మీద కమల ప్రయాణాన్ని ఆపగలిగాడు.

ఆ ఏడు కమల ఫస్టుక్లాస్‌లో పాసైంది. ఆ సంవత్సరమే రాఘవేంద్రంగారు శాసనసభ సభ్యుడుగా ఎన్నిక అయ్యారు. కాకినాడ నుండి హైదరాబాద్‌కు మార్చారు. కమలను తన ప్రోద్బలం మీదనే ఎం.బి.బి.ఎస్. లో చేర్పించారు.

తర్వాత తను బి. ఏ. లో చేరాడు. పరీక్షలలో చాలా మంచి మార్కులు వచ్చేవి. కానీ ఏం లాభం! దైవం ఎదురుతిరిగినప్పుడు కష్టాలు అలా సముద్ర తరంగాల్లా వస్తూనే ఉంటాయి. వాటికి ఒక అంతూ పంతూ అంటూ ఉండదేమో అనిపిస్తుంది. అవి ఎందుకలా వస్తూ ఉంటాయి అంటే సమాధానం చెప్పడం కష్టం.

యూనివర్సిటీ పరీక్షలు జరుగుతుండగా అమ్మ చనిపోయినది. తనకు మాతృమూర్తి కరువైపోయినది. తనను శాశ్వతంగా విడిచి వెళ్లిపోయినది. ఛీ! ఎందు కీ చదువు? ఈ పరీక్షల్లోనే తల్లిని, తండ్రిని ఇద్దరినీ కోల్పో యాడు. ఇంక తనకు మిగిలిన దెవరు? ఒక్కగా నొక్క తమ్ముడు. వాడి రక్షణ భారమంతా తనమీద పడినది.

ఉన్నపొలం అంతా రైతు హక్కు అయిపోయి నది. ఆస్తి అంతా అప్పులు తీర్చడానికి సరిపోయి నది. ఇక తను చదువు విరమించుకోవాలను కున్నాడు. ఒక ఏడాది గడిచిపోయినది. స్నేహి తులంతా పట్టు పట్టటం వలన బి. ఎ. పరీక్షకు డబ్బు కట్టాడు. ఏమాత్రం చదవకుండానే పరీక్షలకు వెళ్లాడు. పేపర్లు వ్రాస్తూఉంటే చెయ్యి వణకడం మొదలుపెట్టినది, 'ఈ పర్యాయం ఎటువంటి దుర్వార్త వినవలసి వస్తుందో' అని. కానీ దైవానుగ్రహం వలన అటువంటి దేమీ జరగలేదు. ఫస్టు క్లాస్‌లోనే నెగ్గాడు. ఎం. ఎ. చదవమని ఎవరు ఎంత



గజరాజు (నాగార్జున కొండ శిల్పం)
ప్రతిచిత్రం—ఎస్. మురళీమోహన్‌రావు
(తిరుపతి)

బతిమాలినా వినలేదు. మంచి ఉద్యోగం ఇప్పిస్తానని రాఘవేంద్రంగారు హైదరాబాద్ రమ్మన్నారు. తను వెళ్లలేదు. విశాఖపట్టణం లోనే చిన్న గుమాస్తా ఉద్యోగం సంపాదించు కున్నాడు. ఈ జీతం రెండు జీవాలకు చాలు. తనకు మిగిలినది ఒకే ఒక ఆశయం; తమ్ముడిని బాగా చదివించాలి.

ఆలోచనలు అంతరించిపోయాయి. నగర మంతా మాటు మణిగినది. కిటికీలోనుంచి గుడ్డి వెన్నెల వచ్చి పడుతున్నది. దూరంగా అనంతపథంలో ఉన్న నక్షత్రాలు మినుకు మినుకు మంటున్నాయి. హాలులో ఉన్న గోడ గడియారం ఒక గంట కొట్టినది.

మర్నాడు మధ్యాహ్నం, మాటలలో "ఏం రవీంద్రా, నువ్వు ఎం. ఎ. చదవకూడదూ?" అన్నారు రాఘవేంద్రంగారు.

"ఇక నాకు చదువు వద్దండీ. చదువుకూ, నాకూ బద్ధవైరం" అన్నాడు రుద్ధకంఠంతో.

"సరే నీ ఇష్టం. కానీ ఒక్క విషయం మాత్రం చెబుతున్నాను, రవీంద్రా. కమల పైకి అలానే కనిపిస్తుంది కానీ, దాని హృదయం అర్థం చేసుకోవడం చాలా కష్టం. నీ మీద ప్రేమలేదని ఎప్పుడూ అనుకోవద్దు" అన్నారు.

ఈ సంభాషణను తెర వెనుకనుండి వేరొకరు వింటున్నట్లు వీరిద్దరిలో ఎవ్వరూ గమనించ లేదు.

## 4

కమల ఎం. బి. బి.ఎస్. పూర్తి చేసినది. ఒక సంవత్సరం పాటు ఎప్రెంటిసుగా పని చేయ డానికి విశాఖపట్టణం కె. జి. హాస్పిటల్‌లో వేశారు. కమల, రవీంద్రుడు ఒకే ఇంట్లో ఉంటున్నారు. కమల దీనికి ముందు ఒప్పుకో లేదు. కాని నాన్నగారి మాటలను కాదనలేక పోయినది. ఇద్దరూ మాటాడుకోవడమంటూ ఎప్పుడూ పడదు. కమలకు ఆస్పత్రి డ్యూటీతో క్షణం తీరిక ఉండటం లేదు. రవీంద్రునికి పగలు ఆఫీస్ డ్యూటీ ఉంటుంది.

తీరిక సమయంలో ఏవో పుస్తకాలు చదువు కుంటూ ఉంటాడు. ఆ ధ్యానంలో భోజనం సంగతి కూడా మరిచిపోతాడు. ఒక్కొక్కసారి రాత్రి రెండుమూడు కూడా అవుతూ ఉంటుంది. రవీంద్రుని తమ్ముడు చంద్రం అక్కడ హైస్కూలులోనే సెకండ్ ఫారం చదువు తున్నాడు.

కమల ఆస్పత్రినుంచి వచ్చి బుద్ధిగా చదువు కుంటున్న చంద్రాన్ని చూసి, "ఇప్పుడు చదు వేమిటి?" అంది నవ్వుతూ. చంద్రం ఆ మాట వినిపించుకోనట్లు ఇంకా గట్టిగా చదవడం మొదలుపెట్టాడు.

చంద్రం చేతిలోని పుస్తకాన్ని లాక్కొని, "బీచికి వెళ్దాంపద" అంది.

"అన్నయ్య కొడ్తాడు."

"ఎందుకూ?"

"ఈ పద్యం కంఠస్థంగా వస్తేనే కానీ ఎక్కడికీ కదలవద్దన్నాడు."

"ఫరవాలేదులే. బట్టలు మార్చుకో" అంది.

చంద్రం ఉత్సాహంగా లేచాడు.

ఇద్దరూ కలిసి బీచికి వెళ్లారు. అస్తమయ సూర్యుడు పడమటి అంచుకు వాలుతున్నాడు. సముద్రపు కెరటాలు ఉవ్వెత్తుగా లేస్తూ పంచ కళ్యాణీ గుర్రాలకు మల్లే పరుగులిడుతున్నాయి. అనంతదూరంలో సముద్రం, ఆకాశంతో కలిసి లీనమైపోయినట్లు ఉన్నది. దూరంగా పడవలు నల్లటి చుక్కలమాదిరిగా కదిలిపోతున్నాయి.

చంద్రం ఉత్సాహంగా, "వదినా! సముద్రం చాలా బాగుంది కదూ!" అన్నాడు.

సముద్ర తరంగాల వైపు చూస్తూ "ఆఁ!" అంది.

"వదినా, మరి అన్నయ్య మనతో ఎప్పుడూ రాడేం?" అని అడిగాడు నెమ్మదిగా.

కమల ఉలిక్కిపడి "ఆఫీసులో పనుంటుంది" అంది.

"అబద్ధం. అన్నయ్య అంటే నీకు కోపం కదూ?" అన్నాడు, వదిన కళ్లలోకి చూస్తూ.

"మీ అన్నయ్యమీద నాకెందుకు కోపం?"

"మొన్న అన్నయ్య సినిమాకి వెళ్లినప్పుడు చెప్పాడు!"

"ఏమని?" అడిగింది ఆత్రుతగా.

"మొన్న సాయంకాలం అన్నయ్యేమో నన్ను సినిమాకు వెళ్దాం రమ్మనమన్నాడు. నేనేమో 'వదినను కూడా పిలుద్దామన్నయ్యా!' అన్నాను. అప్పుడు అన్నయ్యేమో, 'మీ వదినకు నేనంటే కోపం. నాతో సినిమాకు రాదు' అన్నాడు. ఏం వదినా! అన్నయ్యంటే నీకు నిజంగా కోపం కదూ!" అన్నాడు అమాయకంగా.

"ఊహూ!"

"మరి అన్నయ్యతో ఎప్పుడూ మాటాడవేం?"

ఈ అడ్డదిడ్డ ప్రశ్నలతో కమలకు కొంచెం కోపం వచ్చినది. వెంటనే "ఈ విషయాలన్నీ నీ కెందుకూ?" అన్నది గట్టిగా.

# కోమల హృదయం

చంద్రం ఉలిక్కిపడ్డాడు. వదినకు కోపం రావడం ఎప్పుడూ చూడలేదు. ఎందుకో చంద్రం కనులు అప్రయత్నంగా నీళ్లతో నిండాయి. పసివాడిపై చూపించిన కోపానికి తనను తానే నిందించుకుంది కమల. చంద్రాన్ని దగ్గరగా తీసుకొని, "కన్నీళ్ళేవిటి చంద్రం?" అంది, చీరకొంగుతో తుడుస్తూ.

"నువ్వు కోప్పడ్డావుగా?"

"ఉత్తనే అన్నాను. ఛొఛా! అలా ఏడవ కూడదు.. రేపు మనం అంతా సినిమాకు వెళ్దాం."

చంద్రం సంతోషంగా "నిజంగానా?" అన్నాడు.

కమల నెమ్మదిగా "ఊఁ!" అన్నది.

## 5

లోపలకు వచ్చిన వెంకయ్యను చూసి "ఆదేం వెంకయ్యా, ఇలా వచ్చావ్" అని అడిగింది కమల.

"పెద్ద బాబుగోరికి జరం ఇంకా నిక్కువై పోయిందమ్మా!" అన్నాడు వెంకయ్య.

"ఫరవాలేదు. అదే తగ్గిపోతుందిలే."

"ఎంత పిలిచినా మాటాడడం లేదమ్మా! ఒక్కసారి ఇంటికొస్తారామ్మా!"

"నా కిప్పుడు తీరుబడి లేదు. ఇప్పుడు పార్టీ ఉంది. తర్వాత ఒక డెలివరీ కేసుకు ఇంకోవూరు వెళ్లాలి. రేపు సాయంకాలందాకా ఇంటికి రావడం పడదు."

వెంకయ్య నసుగుతూ "అది కాదమ్మా...ఒక్క సారి..." అన్నాడు.

"చెప్తూంట నీకుకాదూ!..అవతల నాకు చాలా అర్జెంట్ పనులున్నాయ్" అని అక్కడినుంచి వెళ్లిపోయినది కమల.

తిరిగి ఇంటికి వచ్చేసరికల్లా రెండు రోజులైంది.

హాలులోకి వచ్చిన వెంటనే చీఫ్ డాక్టర్ ఎదురై "నువ్వు చాలా అదృష్టవంతురాల వమ్మా!... చాలా సీరియస్ అయింది. ఇప్పుడు ఫరవాలేదు. బాగానే ఉన్నాడు" అన్నారు.

అతికష్టంమీద కమల "థాంక్స్" అన్నది... గబగబ మేడ మీదకు వచ్చినది. రవీంద్రుడు కళ్లు తెరిచే ఉన్నాడు. ముఖంలో చాలా మార్పు కనిపిస్తూ ఉన్నది.

కమల నెమ్మదిగా "ఇప్పుడెలావుంది?" అన్నది.

"ఫరవాలేదు. ఇంకా ఇప్పట్లో చావ ననుకుంటాను" అని అటు తిరిగి కళ్లు మూసు కున్నాడు.

కమల హృదయం గతుక్కుమన్నది. కొన్ని క్షణాలు అక్కడనే నిలబడి తన గదిలోకి వెళ్లి పోయినది.

వారం రోజులు గడిచిపోయాయి. రవీంద్రుడు కొంచెం కోలుకోగలిగాడు. ఎప్పట్లా ఆఫీసుకు వెళ్లగలుగుతున్నాడు. ఇంకా నీరసం మాత్రం పూర్తిగా తగ్గలేదు. అయినా తన కార్యక్రమం మానలేదు. రాత్రి రెండు గంటల దాకా దీపంవద్ద కూర్చొని ఏవో పుస్తకాలు తిరగవేస్తూ ఉంటాడు. ఒకసారి కమల ఇది గమనించి రవీంద్రుని వద్దకు వెళ్లి "మొన్న జబ్బు చేసింది. ఇలా రాత్రంతా మేలుకుంటే మళ్లీ ఆరోగ్యం పాడవదూ?" అంది.

దానికి రవీంద్రుడు సమాధానంగా "పాడయ్యేది నా ఆరోగ్యమేగా! దానివలన నీకు కలిగే ఇబ్బం దేమీ ఉండదు!" అని పుస్తకంలో లీన మయ్యాడు.

'అవును. నాకెందుకు మధ్య' అనుకుంది మనస్సులో.'

రెండు రోజులనుంచి చంద్రంలో చాలా మార్పు కనిపించినది కమలకు. ఇదివరకు ఎప్పుడూ తనతోనే తిరుగుతూ ఉండేవాడు; నవ్వుతూ ఉండేవాడు. తనంటే అమితమైన ప్రేమ. ఎందుకో తనను చూసి తప్పించుకు తిరుగుతున్నాడు.

గదిలో వెళ్లిచూసేసరికి చంద్రం మంచం మీద పరుండి ఉన్నాడు.

"చంద్రం!" అని పిలిచింది.

కళ్ళు తెరిచి "ఊఁ!" అన్నాడు. ఆ స్వరం చాలా నీరసంగా వచ్చినది.

"పడుకున్నావేం?" అని అడిగినది.


"ఉత్తినే."

"ఒంట్లో బద్ధకంగా ఉందా?" అని మంచం మీద ఒక ఓరగా కూర్చొని మెడమీద చెయ్యి వేసి చూసి "జ్వరం తగిలిందే.. తలనొప్పి కానీ ఉందా?" అని అడిగింది.

"ఆఁ!" అన్నాడు.

"మరి నాతో చెప్పలేదేం?" చంద్రం మాటాడలేదు. మళ్లీ అడిగింది.

చంద్రం కళ్లల్లో నీళ్లు చూసి "ఇదేమిటి



ఏకాంతం

చిత్రం—రావాడ కృష్ణ (రామేశ్వరం)



దీపాంజలి

చిత్రం — కె. భాస్కరరావు (విశాఖపట్నం-3)

చంద్రం?" అన్నది.

చంద్రం నుంచి ఎటువంటి సమాధానం రాకపోయేసరికి కమల, లాలనగా చంద్రం తల నిమురుతూ "ఏం చంద్రం? నాతో చెప్పకూడదా?" అన్నది.

చంద్రం ఒకసారి కమల కళ్లల్లోకి చూసి "నిన్ను వదినా అని పిలవవద్దన్నావటగా" అన్నాడు. ఈ మాటంటూ ఉంటే చంద్రం కనులలో నీరు మరింత తిరిగింది.

కమల ఆశ్చర్యంగా "ఎవరన్నారు?" అంది.

"అన్నయ్య."

"ఏమన్నారు?"

"వదినా అని పిలిస్తే నీకు కోపం వస్తుందట! అలా పిలవవద్దని నువ్వు అన్నయ్యతో చెప్పావా?" అని అడిగాడు అమాయకంగా.

కమల మ్లానవదనంతో "నే నలా పిలవ వద్దని ఎవరితోనూ అనలేదు" అని వెంటనే చిరునవ్వు తెచ్చిపెట్టు కొని, "అందుకని నాతో మాటాడటం మానేద్దామను కున్నావా? మందు తీసుకు వస్తానుండు" అని లోపలకు వెళ్లి ఒక మాత్ర తెచ్చి ఇచ్చినది.

* * * *

సాయంకాలం ఆఫీసు పని అయిన వెంటనే రవీంద్రుడు గదిలోకి అడుగు వేయబోయి చటుక్కున ఆగిపోయాడు. గదిలో ఏవో మాటలు వినరావడంతో ఆ ప్రక్కనే కిటికీ వెనుక నుంచి విన్నాడు. గదిలో ఉన్న వేరొక వ్యక్తి డాక్టర్ సూర్యం అని వెంటనే పోల్చు కున్నాడు.

"ఏమంటావ్, కమలా? నువ్వా ఎం. బి. బి. ఎస్. పేసయ్యావ్. నీభర్త ఒక గుమాస్తా. ఎక్కడైనా చెప్పుకుంటే సిగ్గు. మనం ఇద్దరం వివాహం చేసుకుందాం. మనం ఇద్దరం కలిసి ప్రాక్టీస్ పెట్టడం వలన మంచి భవిష్యత్తు ఉంటుంది. ఈ విషయం నీతో యిదివరకే చెబుదా మనుకొన్నాను. నీ భర్తపై నీకు ఎటూ ప్రేమ లేదు. ఈ విషయం అందరికీ తెలిసిందే. త్వరలోనే మనం వివాహం చేసుకుందాం. ఏమంటావ్ కమలా?" అని కొన్ని క్షణాలాగి, కమలనుండి సమాధానం రాకపోవడంతో మౌనం అర్థాంగీకారంగా భావించి "నాకు తెలుసు, కమలా! పైకి చెప్పకపోయినా నీ హృదయాన్ని ఎప్పుడో అర్థం చేసుకున్నాను. పాపం! ఉత్త మొద్దయిన ఒక మూర్ఖునితో నువ్వుమాత్రం ఎలా కాపరం చెయ్యగలవ్!" అని కొంచెం దగ్గరగా వచ్చి కమలను తనవైపుకు లాక్కో బోయాడు.

సూర్యం చెంప ఛెళ్లుమంది. "యూ షటప్" అని కమల ప్రక్క గదిలోకి వెళ్లిపోయినది.

చెంప తడుముకుంటూ పలాయన మంత్రం పఠించాడు డాక్టర్ సూర్యం. రవీంద్రుడు ఒక నిమిషం అక్కడనే ఆగి ఏమీ తెలియనట్లు గదిలోకి వెళ్లాడు. భర్త రాక గమనించి కమల ముందు భయపడినది. కాని రవీంద్రుడు ఏమీ మాటాడకపోయేసరికి గమనించలేదనుకున్నది.

రాత్రి భోజనం అయిన తర్వాత కమల ఏదో పుస్తకం తిరగవేస్తున్నది. ఇంతలో రవీంద్రుడు అక్కడకు వచ్చి "నువ్వు చాలా పొరపాటు పని చేశావు, కమలా!" అన్నాడు.

కమల ఆశ్చర్యపోయి "ఏవిటి" అన్నది.

"డాక్టర్ సూర్యంగారిని అలా అవమాన పరచడం అంత మంచి పని కాదనుకుంటాను" అని కొన్ని క్షణాలు ఆగాడు.

ఎందుకో కమల హృదయం ఒక్కసారి స్పందించింది. వెంటనే మళ్లా రవీంద్రుడే అన్నాడు: "చూడు కమలా! డాక్టర్ సూర్యం అన్న మాటల్లో ఏమాత్రం అబద్ధంకానీ, హాస్యాస్పదమైన సంగతి కానీ లేదు. ఆతడు నీ ప్రేమ కాంక్షించాడు. నిజంగా మీ ఇద్దరూ కలిసి ప్రాక్టీస్ పెడితే మంచి అభివృద్ధిలోకి వస్తారు. ఒక గుమస్తా భార్య అనే అపనింద నీకు పోతుంది."

కమల ఏదో అనబోయింది. కాని కమల మాటాడటానికి తావీయలేదు. ఇంకా చెప్పకు పోసాగాడు: "మన ఇద్దరి కి వివాహ మయిందన్న విషయం నిజమే. అయితే హృదయాలు పరిపూర్ణతకు రాకముందు అయినది. దానికి అంత విలువ నీయ నక్కర్లేదు. పెద్దవాళ్లు తెలిసీ తెలియక చేసిన దానికి మనం బాధ్యులం కాము. నన్ను అనుమానించవద్దు కమలా! నేను మీ వివాహానికి మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. మీ నాన్నగారు ఒప్పుకోరేమో అని భయ పడకు. మీ నాన్నగారిని ఒప్పించే పూచీ నాది. ఈ సదవకాశాన్ని జారవిడుచుకోవద్దు కమలా!"

కమల నిర్విణ్ణురాలై కొన్ని క్షణాలవరకు స్తబ్ధులా అలానే ఉండిపోయింది. చివరకు తేరుకొని, "అయితే మీ రనే దేమిటి?" అంది.

"డాక్టర్ సూర్యం చెప్పినట్లు—"

ఇంకా వాక్యం పూర్తి కాకుండానే "చాటుగా ఆ మాటలన్నీ విని ఊరుకొనే బదులు, ఆ సమయంలో ఎదురుగా వచ్చి ఆ మాట అన్నందుకు అతనికి బాగా బుద్ధి వచ్చేటట్లు చెయ్యరాదూ!" అన్నది.

"నేను నీ క్షేమం కోరే చెబుతున్నాను కమలా!"

"నా క్షేమానికి ఇప్పు డేం లోటులేదు. ఈ విషయమై మీ సలహాలను ఎవరూ అర్థించలేదు. ఇటువంటి సలహాలను ఈయడంలో ఇవతలవాళ్ల హృదయాలను బాధించడమే మీ ఉద్దేశ్యం కాబోలు!"

"లేదు కమలా! నే నలా ఎన్నడూ అనుకోవటంలేదు."

కమల కొంచెం కోపంగా, "అనుకోక పోవడానికి మీరేం అమాయకులుగారు. కోరే చేస్తున్నారు; చేయిస్తున్నారు."

రవీంద్రుడు ఆశ్చర్యంగా, "నేనా!" అన్నాడు.

"ఆ మీరే .. ఆ వేళ చంద్రాన్ని పిలిచి నన్ను వదినా అని పిలవవద్దనటంలో మీ ఉద్దేశ్యం?"

"ఆ పిలుపు నిన్ను బాధ కలిగిస్తుందను కొనే అలా అన్నాను."

"ఏవో ఊహలను కల్పించుకొంటూ, వాటినే బలపరచుకొని ఇతరుల మీద రుద్దడం చాలా అన్యాయం. వాటివలన ఇతరుల హృదయం ఎంత బాధపడుతుంతో కాస్త అర్థం చేసుకోవాలి."

"అలా అని నేను అనుకోలేదు. కేవలం పైవారిని బాధపెట్టాలనేది నా అభిమతం కాదు!"

"అదే నిజమైతే ఇటువంటి సలహాలు ఎప్పుడూ ఇచ్చి ఉండేవారు కాదు. నేను కూడా ఒక భారతీయ స్త్రీనే" అని కమల అక్కడ ఇక నిలవకుండా తన గదిలోకి వెళ్లిపోయినది.

కమల మాటలు రవీంద్రున కేమీ అర్థం కాలేదు. నిజంగా తన ప్రవర్తన కమలకు బాధ కలిగించిందా అని ప్రశ్నించుకున్నాడు.

కమల వస్తూనే మంచం మీద వాలిపోయింది. 'భారతీయ స్త్రీ, పతిని దైవ సమానంగా చూసుకుంటుంది. మరి తానో..' ఏవో ఆలోచనలతోనే కమల నిద్రపోయింది. బాగా పొద్దు ఎక్కిన తర్వాత చంద్రం వచ్చి పిలవడంతో లేచి కూర్చున్నది. కిటికీగుండా ఎండ వచ్చి గదిలో పడుతున్నది. గంట అప్పుడే ఎనిమిదైందని తెలుసుకొని మనసులోనే "అబ్బా!" అనుకున్నది.

(సశేషం)

# కోమల హృదయం

**జరిగిన కథ**

*రవీంద్రుడు గుమాస్తా. ఎమ్. బి., బి. ఎస్. చదువుకున్న కమల అతడు తన 'భర్త' అని చెప్పుకొనడానికి కూడా సిగ్గుపడింది. విశాఖపట్టణంలో కాపురం. డాక్టర్ సూర్యం అన్న మాట లను ఉభయులూ వాదించుకొన్నారు.*

(క్రిందటి సంచిక తరువాయి)

ఒకరోజు సాయంకాలం రవీంద్రుడు హాలులో కూర్చొని ఏదో పుస్తకం చదువుకొంటూ ఉంటే కమల అక్కడకు వచ్చి వేరొక కుర్చీలో కూర్చున్నది. కమల రాకకు రవీంద్రుడు కొంచెం ఆశ్చర్యపడ్డాడు. అయినా ఏమీ పలక రించకుండా పుస్తకం చదువుకుంటూనే ఉండి పోయాడు.

కొన్నిక్షణాలు నిశ్శబ్దంగానే గడిచాయి.

ముందుగా కమలే పలకరించింది, "మీ రీ ఉద్యోగం మానివేయకూడదూ?" అని.

రవీంద్రుడు నిశ్చేష్టుడై పోయాడు. కమల ఇలా వచ్చిందంటే ఏదో అవసరమైన పని ఉంటుందని ముందే ఊహించాడు. కాని ఇలా అంటుందని ఊహించలేదు. అయినా తన కల వరపాటును పైకి వ్యక్తం చేయకుండా "ఎందుకని" అన్నాడు.

"మీరు తెచ్చే ఆ వంద రూపాయలు లేక పోతేమాత్రం ఏంపోయింది?" అన్నది నసుగుతూ.

"నువ్వు కలవారి కూతురువి. పెద్ద ఉద్యోగం చేస్తున్నావు. నీకు వంద రూపాయలు చులకనగానే కనిపించవచ్చు. నాకా! ఉన్నదల్లా ఈ ఒక్క ఆధారమే. దీనితోనే మా ఇద్దరికి పోషణం జరగాలి. చంద్రాన్ని బాగా చది వించాలి.."

"చంద్రం చదువుకు ఇపుడేం లోపం వచ్చిందని.."

"లోపం వచ్చిందనడంలేదు. వాడి చదువు కోసమని వేరొకరు ఎంత కాలమని డబ్బు వృధా చేసుకోగలరు?"

ఆ మాటలలోని అంతర్భావాన్ని కమల గ్రహించకపోలేదు. ఇంకా రవీంద్రుడు చెప్పుకు పోసాగాడు: "నాకు కావలసిందల్లా ఒక్కటే కమలా! చంద్రాన్ని బాగా చదివించాలి. ఎంత డబ్బు ఖర్చుఅయినా ఫరవాలేదు. కష్టించి సంపా దిస్తాను. అదే నాకు ఆనందం." ఆ చివరి మాట అంటూ ఉంటే రవీంద్రుని హృదయం అనురాగ పరిపూరితమయింది.

"అందుకని నన్ను నవ్వులపాలు కమ్మంటారా?" అన్నది బాధగా.

రవీంద్రుడు బాధపడి, "ఎందుకు కమలా?" అన్నాడు.

"మీ ఉద్దేశ్యం అదేలా కనిపిస్తున్నది. నన్ను చూచి అంతా చాటు చాటుగా ఒక గుమాస్తా భార్య అని నవ్వుతున్నారు. ఎక్కడికి వెళ్లాలన్నా నాకు తలవంపుగా ఉన్నది. మీ ఉద్దేశ్యం కూడా ఇదే! లేకపోతే మీకెందుకీ పట్టుదల? తమ్ముడైనంత మాత్రాన చంద్రం బాధ్యత, మంచి అంతా ఒక్క మీకే ఉంటాయనుకోవడం చాలా పొరపాటు. అతడి క్షేమం, అభివృద్ధి కోరేవాళ్ళు ఇంకొకరు కూడా ఉన్నారు అన్న విషయంమాత్రం మరిచిపోకండి. ఇప్పుడా వందరూపాయలు రాకపోతే మాత్రం ఏం పోయింది? మీకు వీలుకాకపోతే నేనే నా ఉద్యో గానికి రాజీనామా ఇచ్చేస్తాను. దానికి మీకు ఆనందంగా ఉంటుంది."

రవీంద్రుడు మనస్సులో బాధపడి, "వద్దు కమలా! నేను నీ మార్గానికి ఎప్పుడూ అడ్డు రాను. నే నిక్కడ ఉండటం వల్లనేగా ఈ బాధలు? నే నింకోవూరు బదిలీ చేయించు కుంటానులే. నావలన బాధ పోతుంది. ఈ విషయం కొంచెం ముందే చెప్పవలసింది! అయినా ఫరవాలేదు. ఒకరి ఇంట్లో అన్నం తింటూ వారి జీవితాన్నే నాశనం చేస్తున్నా నన్న విషయం గ్రహించలేకపోయాను. నన్ను క్షమించు. ఇప్పుడే కాదు. భవిష్యత్తులో కూడా నీమార్గానికి అడ్డురాను, కమలా!" అని చేతిలో ఉన్న పుస్తకాన్ని బల్లమీద పడేసి వెళ్లిపోయాడు.

తన ప్రవర్తనకు, మాటలకు రవీంద్రుడు మనస్సులో బాధపడినట్లు ఏమాత్రం కనిపించ లేదు కమలకు. తను ఊహించింది దీనికిపూర్తిగా వ్యతిరేకం. ముఖంలో ఔదాసీన్యపు నీలినీడలు ఒకించుక తారసిల్లినప్పటికీ ప్రశాంతత ప్రస్ఫుటమవుతూనే ఉన్నది. మనోనిగ్రహంతో పైకి వ్యక్తం చేయకపోయినప్పటికీ మనసులో బాధపడి ఉండవచ్చునని నిర్ణయించుకున్నది. అయితే తను మాత్రం ఏం చేయగలదు?

## 6

కాలచక్రం నాలుగు నెలలు పైనే ముందుకు దొర్లుకుపోయినది. రవీంద్రుడు ఆ మరుసటి వారంలోనే కాకినాడకు బదిలీ చేయించుకున్నాడు. చదువుకోసం చంద్రం మాత్రం కమలవద్దనే ఉండిపోయాడు.

కమలకు కొన్నివారాలు హాయిగానే గడిచిపోయింది. కానీ ఇంటిలో ఏదోలోటు కనిపిస్తూనే ఉండేది. కాలం గడుస్తున్నకొద్దీ ఆమె అంతరంగంలో చాలామార్పులు రాగలిగాయి. అద్దం ముందు నిలబడితే తన ప్రతిబింబం తననే నిరసిస్తున్నట్లుగా ఉండేది. తన ఆత్మ తననే విమర్శిస్తూ ఉండేది. తన అంతర హృదయంలో ఏమూలనుంచో "నువ్వు భార తీయ స్త్రీవి కావు" అనే మర్మఘోష బయలు దేరి ప్రకంపించి, ప్రతిధ్వనిస్తూ చెవులు చిల్లులు పడుతున్నట్లుగా ఉండేది. ఏవేవో ఘటనలు జ్ఞప్తికి వస్తూ ఉండేవి.

ఒకరోజు చంద్రం అడిగాడు, "అన్నయ్యా! మీ ఆఫీసు చాలా దూరం కదా? మరి ఒక సైకిలు కొనుక్కోరాదూ?" అని.

"అంత డబ్బు ఇప్పు డెక్కడుంది బాబూ! తర్వాత కొనుక్కుంటానులే!"

చంద్రంనుండి ఈ విషయం తెలుసుకున్న తర్వాత తను చాలా బాధపడింది. జీతంలోని మూడు వంతులు పైనే తను వద్దని ఎన్ని పర్యాయాలు చెప్పినప్పటికీ వినకుండా తన బల్లపై ఉంచి వెళ్లడం జరిగేది. సైకిలు గురించి తానే ప్రసంగం ఎత్తినప్పటికీ "ఫరవా లేదు. నడిచి వెళ్లగలను" అన్న సమాధానమే వచ్చేది. మళ్లా ఆ ప్రసక్తే రాలేదు.

వెళ్లిన దగ్గరినుంచి ఇంతవరకు ఒక్క ఉత్తరం లేదు. కనీసం చంద్రానికైనా వ్రాయ లేదు. ఒకసారి 50 రూపాయలు మనియార్డరు మాత్రం వచ్చినది.

ముఖ్యంగా క్రితం రాత్రి వచ్చిన కలతో కమలలో చాలా మార్పు వచ్చిందనే చెప్పాలి. సగం కలలోనే ఉలిక్కిపడి లేచింది. ఇంకా భయంతో శరీరం వణుకుతూనే ఉన్నది. అది కలో, నిజమో కొంత సేపటివరకు తెలుసు కోలేకపోయింది. శరీరమంతా చెమటలు క్రమ్మి ఉన్నాయి. భయంగా మంగళసూత్రాన్ని గట్టిగా పట్టుకున్నది. "అంత గట్టిగా అరిచావే, వదినా!" అంటూ చంద్రం వచ్చేవరకు, అదంతా కల అని పోల్చుకోలేక పోయినది. ఎందుకో తన హృదయం బాధపడుతున్నది. నిజంగా తనను ఎం. బి. బి. ఎస్. చదవమని ప్రోత్సాహం చేసింది ఎవరు? తను మూర్ఖంగా ఇలా ప్రవర్తించడానికి కారణం ఏమిటి? తను ఇంటర్మీడియేట్ చదువుతున్నపుడు జరిగిన వాక్స్పర్ధ జ్ఞప్తికి వచ్చినది. మాటాడవలసిన విషయం స్త్రీ హృదయం. చాలామంది స్త్రీ హృదయం కోమలం అంటూ వాదించారు. అప్పుడు రవీంద్రుడు చెప్పిన మాటలు ఇప్పటికీ చెవులలో మార్మోగుతూనే ఉన్నాయి. "స్త్రీ హృదయం కోమలమని నేనూ ఒప్పుకుంటాను. అయితే కొన్ని పరిసరాల ప్రభావం వల్లనైతేనేమి, ఆత్మలో చెలరేగే విరుద్ధ ఫలితాలవలన నైతేనేమి కోమల మంటూ మనం అనుకొనే తెరవెనుక

**కిళాంబి శేషావతారం**

క్షీణత్వం కూడా ఉంటుంది స్త్రీలో. ఒక్క సామాన్యమైన కఠినమే కాదు, స్వార్థపూరితమైన భావాలు కూడా సమ్మిళితమై ఉంటాయి. అయితే ఇది బాహ్యరూపం ధరించడమనేది చాలా అరుదుగా ఉంటుంది. ఉదాహరణకు ఏ పెద్ద ఉద్యోగిఅయినా ఉన్నాడనుకోండి. అతడి భార్య సామాన్యమైన విద్యావతియైనా, కాకపోయినా స్వార్థరహితంగా ప్రేమిస్తాడు. వారి దాంపత్యంలో ఎటువంటి చీకూ చింతా ఉండదు. అలా కాకుండా భార్య పెద్ద ఉద్యోగం చేస్తూ ఉంటే, ఉదాహరణకు లేడీ డాక్టర్ అనుకుందాం. భర్త కాని సామాన్య ఉద్యోగి అయితే ఇంక ఆ దాంపత్యం గూర్చి చెప్ప నక్కర్లేదు. భర్తను చాలా నీచంగా చూస్తుంది. తన పరువుప్రతిష్ఠలన్నీ కోల్పోతున్నట్లు భావించుకుంటుంది. మెడలోని మంగళసూత్రం విషసర్పంలా బుసలుకొడుతూ ఉంటుంది...'

అక్షరాలా తన విషయంలో అదే జరిగింది. తనమూలో బాధ పడవచ్చునేమో అనయినా ఆలోచించకుండా ప్రవర్తించినది. ఇంటినుంచి వెడలగొట్టించినది. వెళ్ళుతున్నప్పుడు తను కనీసం మాట వరసకైనా పలకరించలేదు. తన గదివైపుకే వస్తూ ఉండటం గమనించి నిద్ర పోతున్నట్లు నటించింది. తర్వాత తనకై వ్రాసి ఉంచిన ఉత్తరం చదువుకుంది. ఆ ఉత్తరం ఇప్పటికీ తన కళ్ళ ఎదుట తిరుగుతూనే ఉన్నది.

"కమలకు,

ఇలా నీకు ఉత్తరం వ్రాయడం కోపం కలిగించవచ్చు. అయినా వ్రాస్తున్నాను. బహుశా పూర్తిగా చదవకుండా ముందుగానే చింపేస్తావనుకుంటాను. ముఖ్యంగా ఒక్క విషయం తెలియజేద్దామనుకుంటున్నాను. 'నన్ను బాధపెట్టడమే మీ ఉద్దేశ్యం; అదే ఆనందం' అని ఇంకేమేమో అన్నావు. నిజం చెబుతున్నాను కమలా! మనస్ఫూర్తిగా అటువంటి చెడు ఉద్దేశ్యం ఎన్నడూ లేదు.

ముఖ్యంగా ఇంకో విషయం చెబుతున్నాను, కమలా! చంద్రం చిన్నతనంలోనే అమ్మా, నాన్నా పోయారు. వాడికి ఏ లోటూ రాకుండా వృద్ధిలోకి తీసుకురావడమే నా కోరికని నీకూ తెలుసు. ఈ బదిలీవలన చంద్రం చదువు మధ్యస్థంలో ఎక్కడ పాడవుతుందో అని చాలా భయపడ్డాను. కాని చంద్రాన్ని ఇక్కడనే ఉంచమని నువ్వు అడిగినప్పుడు నాలో కలిగిన ఆనందానికి అంతులేదు, కమలా! ఈ విషయం ముందుగా, నేనే అడుగుదామనుకున్నాను. కాని నువ్వు బాధపడతావని మానుకున్నాను. వాడికి నాకన్నా నీ దగ్గరే ఎక్కువ చనువు. వాడి చదువుకు, పోషణకు చాలా ఖర్చు అవుతుందని తెలుసు. కాని నా దగ్గర ప్రస్తుతానికి ఎక్కువ డబ్బు లేదు. ఈ నిడై రూపాయలు మాత్రమే ఉంచుతున్నాను. జీతం వచ్చిన వెంటనే మళ్ళా పంపిస్తాను.

ఇంకో విషయంతో ఉత్తరం పూర్తి చేస్తున్నాను. నేనంటే నీకు చాలా కోపమని తెలుసు. అసహ్యమని కూడా తెలుసు. అందుకే చివరిసారిగా నీతో చెప్పి వెళ్ళదామని వచ్చినప్పుడు తలుపు వేసుకొని ముందే జాగ్రత్త పడ్డావు. పిలిచినా పలకలేదు. ఇప్పు డదంతా దేనికిలే! నా వలన నీకు చాలా కష్టాలు వచ్చాయి. ఇతరులకు కష్టాలు కలిగించడమే నా జీవిత పథమైంది. అవమానంలో, కష్టాలతో మునిగితేలుతున్న నీకు ఇకముందైనా ఆనందం కలుగజేయమని దేవుణ్ణి మరీమరీ ప్రార్థిస్తూ శలవు తీసుకుంటున్నాను కమలా.

ఇట్లు,
రవీంద్రుడు."

ఆ విషయాలు తలుచుకొంటూంటే కమల కళ్ళల్లో నీరు గిరున తిరగసాగినది. ఆమె హృదయం వికలితమైపోయినది. గోడకు తగిలించిన డిగ్రీ ఫోటోను వెంకేసి కొట్టినది. దానిలోని ప్రతి అక్షరం వికటాట్టహాసం చేస్తున్నట్లుగా ఉన్నది. హృదయంలో బయలు దేరిన మహాజ్వాలమైన అనుతాపపు నగ్నరూపం నిశితంగా తొంగిమాస్తున్నది. కంటిలో కదిలే ఆ కన్నీటిలో మరువలేని మరుపురాని బాధ, అగాధంలోకి ఈడ్చుకుపోతున్నట్లుగా ఉన్నది.

అమాయక దృక్కులతో, విర్మల వదనంతో, చిరు దరహాసంతో, ఎదురుగా బల్లమీద ఉన్న భర్త ఫోటోను దగ్గరకు తీసుకొని "నేను మీకు చాలా ద్రోహం చేశాను. నేను చేసిన పాపానికి నిష్కృతి అంటూ లేదు. నన్ను ఎవ్వరూ క్షమించలేరు. మీరు కూడా నన్ను క్షమించలేరు" అంటూ అలాగే తెలివితప్పి పడిపోయింది.

చంద్రం వచ్చి రెండుసార్లు తట్టి లేపే సరికి కమలకు తెలివివచ్చినది.

"ఏడుస్తున్నావేం వదినా?" అని అడిగాడు.

ఆ పసివాని దగ్గర అలా ఏడవటం కమలకు సిగ్గనిపించింది. కాని ఏం చేయగలదు? ఏడుపును ఆపుకోవడం అసాధ్యమైపోయినది.

చీర చెంగుతో కన్నీటిని తుడుచుకొని చంద్రాన్ని దగ్గరగా తీసుకొని, "మీ అన్నయ్య వద్దకు వెళ్ళదాం చంద్రం!" అన్నది.

చంద్రం ఉత్సాహంగా వదిన కళ్ళల్లోకి చూసి, మళ్ళా వంకోచిస్తూ, "నువ్వు కూడా వస్తావా?" అని అడిగాడు.

"ఆ!" అన్నది.

వెంటనే భర్త ఆఫీసుకు వెళ్ళి కాకినాడ ఆఫీసుకు ఫోన్ చేయించినది. రవీంద్రుడు రెండు నెలల క్రిందటనే సెలవు పెట్టి వెళ్ళాడని, సెలవు మాత్రం పదిహేను రోజులే అయినప్పటికీ ఇంతవరకు రాలేదని, ఎక్కడకు వెళ్ళాడో ఎవ్వరికీ తెలియదని సమాధానం వచ్చినది. కమల నిర్ఘాంతపడి నిరాశతో ఇంటికి తిరిగివచ్చేసరికి పోస్ట్‌మన్ టెలిగ్రాంతో ఎదురయ్యాడు. అందులోని విషయం చూడటంతో కమల హృదయం గతుక్కుమన్నది.

"ఆ ఉత్తరం ఏమిటి వదినా?" అని అడిగాడు చంద్రం.

"మనం వెంటనే హైదరాబాద్ వెళ్ళాలి పద" అన్నది.

"మరి అన్నయ్య దగ్గరకు వెళ్ళవద్దా?"

"మీ అన్నయ్య దగ్గరకే."

"మరి అన్నయ్య కాకినాడలో ఉంటున్నాడుగా?"

"ఇప్పుడు అక్కడనే ఉంటున్నారు.." ఏదో ముక్తసరిగా సమాధానాలు చెబుతున్నదన్న మాటేగాని కమల మనస్సు ఇక్కడ లేదు.

* * * *

కమలనుండి వచ్చిన టెలిగ్రాం చూసుకొని రాఘవేంద్రంగారు విమానాశ్రయానికి వెళ్ళారు. కమలను, చంద్రాన్ని కలుసుకున్నారు.

కమల ఆతురతగా "ఎలా ఉంది నాన్నా?" అని అడిగింది.

"తెలివి లేదమ్మా! నిన్న నేడో పనిమీద కారు మీద వెళ్ళుతూ ఉంటే అక్కడ చాలా మంది గుమిగూడి ఉన్నారు. తీరా చూస్తే ఇంకెవరో కాదు. నడుస్తూ నడుస్తూ స్పృహ తప్పి పడిపోయాడట. జ్వరం కూడా చాలా తీవ్రంగా ఉంది."

"డాక్టరుగా రేమన్నారు?"

"ఫరవాలేదన్నారు." ఈ మాట నాన్నగారి నోటినుంచి ధైర్యంగా రావడం లేదని కమల వెంటనే గ్రహించింది.

తన టెలిగ్రాంకు కమల తప్పక వస్తుందని రాఘవేంద్రంగారికి తెలుసు. అయితే ఆ రావడమనేది తనకు భయమడే. టెలిగ్రాం చూసి ఇదే అనుకున్నారు. కమల పడుతున్న ఆ ఆవేదన, ఆ కన్నీరు చూస్తూ ఉంటే చాలా



తథాగతుడు

చిత్రం—ఘంటసాల రాము (మద్రాసు-33)

పరివర్తన కలిగిందని గ్రహించారు. ఆయన ఈ విషయాన్ని ఎప్పుడూ ఊహించలేక పోయారు. కారు ఇంకా సిమెంటు రోడ్డు మీద పరుగులిడుతూనే ఉన్నది.

గదిలోకి అడుగు పెడుతూ ఉంటే కమల హృదయం కంపించసాగింది. మంచం మీద పరుండి ఉన్న రవీంద్రుని చూసి ఉలిక్కి పడినది. తెల్లని ముఖంపై గడ్డం నల్లగా బాగా పెరిగి ఉన్నది. ముఖంలో జీవకళ అంటూ పూర్తిగా నశించిపోయినది. కళ్ళు బాగా లోతుకు పోయాయి. తైల సంస్కారంలేని జుట్టు చిందర వందరగా ఎగసి పడిఉన్నది. అన్నయ్యను కొంత సేపటివరకు పోల్చుకోలేకపోయాడు చంద్రం.

నెమ్మదిగా "అన్నయ్యా" అని పిలిచాడు.

రవీంద్రుడు కళ్ళు మూసుకొని అలాగే పడుకుని ఉన్నాడు. చంద్రం మళ్ళా పిలిచాడు.

రవీంద్రుడు ఒకసారి భారంగా కళ్ళు తెరిచి చూశాడు. ఆ చూపులో జీవం ఏమాత్రం లేదు. ఇంచుమించు పిచ్చివాని చూపు మాదిరిగా శూన్యంలోకి చూస్తున్నట్లుగా ఉన్నది. మళ్ళా వెంటనే కళ్ళు మూసుకున్నాడు.

"డాక్టర్‌గారు వచ్చి ఎంత సేపైంది వాన్నా?" అని అడిగింది కమల.

"ఒక గంట క్రితమే వచ్చారు. మళ్ళా రమ్మని ఫోన్ చేస్తాను" అని రామచంద్రం గారు వెళ్ళిపోయారు. స్నానం చేయించటానికి చంద్రాన్ని వసిమిని తీసుకువెళ్ళింది.

కమల ఇంకా అక్కడనే అలాగే నిలబడి పోయినది. చెంపల మీదుగా ఇంకా కన్నీరు కారుతూనే ఉన్నది.

రవీంద్రుడు ఒకసారి ఇటునుండి అటు వైపుకు తిరిగి, "ఇక భవిష్యత్తులో కూడా నీ మార్గానికి అడ్డురాను కమలా. మళ్ళా నీ కంటికి ఇక కనుపించను" అంటూ సణగసాగాడు. ఆ కంఠధ్వని మాతిలోనుంచి వస్తున్న ట్లుగా ఉన్నది. కమల కన్నీరు కట్టలు తెంచు కొని రాసాగినది. ఇక అక్కడ నిలబడలేక గబగబ తన గదిలోకి పోయి పరుపు మీద పడి వెక్కి వెక్కి ఏడవసాగినది.

* * * *

రెండు రోజుల తర్వాత రవీంద్రునికి తెలివి వచ్చినది. కళ్ళు తెరిచే సరికి ఎదురుగా చంద్రం కనిపించాడు. అన్నయ్య క్రితం రోజులాగే చూస్తున్నాడేమో అనుకొని, అటే చూస్తూ ఉండిపోయాడు.

"చంద్రం!" అని అన్నయ్య తనుపిలవడంతో చంద్రం ఉత్సాహంగా, సంతోషంగా, "అన్న య్యా!" అన్నాడు. ఆ పసి హృదయంలో వేయి విపంచితంత్రులు మీటినట్లయినది.

వెంటనే "వదిన అదిగో అన్నయ్యా!" అన్నాడు.

ఆ ప్రక్కనే ఉన్న కమలను ఇందాకటి నుంచి రవీంద్రుడు గమనించలేదు. అటు వైపు చూశాడు. నిజంగా కమల ముగ్ధలా తలవంచుకొని నిలబడి ఉన్నది. ముఖం కని పించకపోయినప్పటికీ కమల కళ్ళలో కన్నీళ్ళు కదలాడుతున్నవని సులువుగా గ్రహించాడు రవీంద్రుడు. అలా ఏడవటానికి గల కారణం వెంటనే ఊహించాడు. అందుకే నెమ్మదిగా అన్నాడు: "మళ్ళా నేను ఈ విశాఖ పట్టణం ఎలా వచ్చానో నాకు తెలీదు కమలా! నువ్వు ఎందుకు బాధపడుతున్నావో నాకు తెలుసు. నీ మార్గానికి అడ్డురానని చెప్పి మాట ఇచ్చి మళ్ళా వచ్చాను. నిజంగా నాకే ఉద్దేశ్యం లేదు కమలా. ఇప్పుడు కదలలేననుకుంటాను. రెండు రోజులు వ్యవధి ఇస్తే చాలు."

వెంటనే చంద్రం, "అన్నయ్యా, ఇది హైదరా బాద్. వదినా, నేనూ విమానంలో వచ్చాము. ఈ రెండు రోజులనుంచీ వదినే నీ దగ్గరుండి మందు ఇస్తున్నది. మరేమో వచ్చిన దగ్గర్నుంచీ అన్నంకూడా తినడం లేదు. కదూ వదినా?" అన్నాడు కమలవైపు చూసి.

రవీంద్రుని నోటిలో మందుపోసి, "కాఫీతీసుకు రమ్మంటారా?" అన్నది.

రవీంద్రుడు అప్రయత్నంగా "ఆఁ!" అన్నాడు.

## 7

రవీంద్రునికి ఇప్పుడు జ్వరం పూర్తిగా తగ్గి పోయినది. అటూ ఇటూ నెమ్మదిగా తిరగగలుగు తున్నాడు. అయితే ఇంకా నీరసం మాత్రం పూర్తిగా పోలేదు.

"ఎన్నాళ్ళు సెలవుపెట్టావు కమలా?" అని అడిగాడు.

"రాజీనామా ఇచ్చి వచ్చాను." ముక్తసరిగా చెప్పినది.

రవీంద్రుడు ఆశ్చర్యంగా "అదేమిటి కమలా?" అన్నాడు.

"నే నింక ఆ ఉద్యోగం చెయ్యను."

"మరి?" అన్నాడు కమల దృష్టిని తన వైపుకు త్రిప్పుకొని. కమల కళ్ళల్లో మళ్ళా



ప్రస్థానం చిత్రం—ఆర్. కరుణబాబు (హైదరాబాదు-24)

రవీంద్రుడు స్తబ్దుడైపోయాడు. కమల ఇంకా అలాగే నిలబడి ఉన్నది. రవీంద్రుని కంటిలోకి చూసే ధైర్యం ఆమెలో లేక పోయినది. ఇంకా తల దించుకొనే ఉన్నది. ఆ తెల్లని పాదాలపై ఆకు పచ్చని చీర కుచ్చెళ్ళు వింజామరలాగా పరిచిఉన్నాయి.

రవీంద్రుడు నిర్నిమేషదృష్టితో అనునయంగా "అవునా, కమలా?" అన్నాడు.

కమల తలఎత్తి చూసినది. ఆమె కన్నుల నుండి నీరు జలజల రాలినది. నిబిడమై, నిర్మలమై, స్నిగ్ధమైన ఆమె అమాయక దృక్కులలో రవీంద్రునికి సరియైన సమా ధానమే లభ్యమైనది.

కమల వెంటనే చీర చెంగుతో కన్నీరు తుడుచు కొని, కొన్ని గ్లాసులో మందుపోసి "ఆఁ, అనండి" అన్నది.

నీరు తిరిగినది. కమల కన్నీటిని చూసి రవీంద్రుడు ఆశ్చర్యపడ్డాడు. ఆడవాళ్ళ కన్నీటి గురించి వేరే ప్రయత్నం చెయ్యనక్కర్లేదు. ఆ నీలి కళ్ళ వెనుకనే ఒక మహా సరస్సు ఉంటుంది అనే సత్యం తెలుసుకున్నాడు. ఆ సమయంలో కమల మరింత అందంగా కనిపించింది రవీంద్రు నికి.

కన్నీరు తుడుచుకొని "నే నింకెక్కడికీ వెళ్ళను. మీతోనే ఉంటాను" అన్నది. ఆ మాటలు జాలిగా, దీనంగా, ప్రార్థనాపూర్వకంగా వచ్చాయి.

రవీంద్ర నెమ్మదిగా "నాకు వచ్చే పంద రూపాయలతో—" అన్నాడు.

ఇంకా పూర్తి చేయకుండానే "పరవా లేదు. మనం ముగ్గురం సర్దుకోగలం" అన్నది.

"అదికాదు కమలా ...నువ్వు..."

"నా పై మీకింకా కోపం ఉందని తెలుసు. నామూలానే మీ రిన్ని బాధలు పడ్డారు. ఆ కోపంతోనే కనీసం చంద్రానికైనా ఉత్తరం వ్రాయలేదు. నా తప్పులను మీరు క్షమించ

జలుబు మరియు జ్వరచిహ్నములనుంచి
సత్వర, మరియు
పూర్తి నివారణకు
'ఆస్ప్రో'

'ఆస్ప్రో' లోనున్న శక్తివంతమైన ఔషధము కంటె నిరపాయముగా బాధను నివారించునది మరొకటి లేదని వైద్యశాస్త్రము రుజువుచేసినది. 'ఆస్ప్రో' ఒక పరిశుద్ధ ఔషధం కావడం మూలంగానే, ప్రపంచమంతా, లక్షలాది మంది బాధితులకు, సత్వర బాధ నివారణకు నిత్యం వైద్యులు ఉపయోగిస్తున్నారు. 'ఆస్ప్రో' లో హానికరమైన ఔషధములు లేవు, దీనిని సురక్షితముగా ఎంత కాలమైనా సేవించవచ్చును. ఎల్లప్పుడూ 'ఆస్ప్రో'ను దగ్గర ఉంచుకోండి.

'ఆస్ప్రో'
అన్నిటికన్న
సురక్షితమైనది, గుణకారి

నికొలాస్‌వారి తయారు    స్వచ్ఛతకు మరియు శుద్ధతకు మీకు గ్యారంటీ కలదు

A.C.161.TEL.

ప్రసిద్ధిచెందిన!
షాహిడక్కన్
సిగరెట్లనే
మీరు ఎల్లప్పుడు వాడండి
వెల: 10 సిగరెట్లు గల
ప్యాకెట్టు
16 న.పై. మాత్రమే




ఇప్పుడు జంట నగరాల లో కూడా లభించు చున్నవి



# కోమల హృదయం

లేరూ?" అంది - భర్త కండ్లలోకి చూస్తూ. ఆమె కళ్లల్లో ఇంకా నీరు తిరుగుతూనే ఉన్నది.

కన్నీరు తుడుస్తూ "ఛా. ఆ కన్నీ రెందుకు కమలా... ఇప్పుడు నా కా ఉద్యోగం కూడా పోయి ఉంటుంది" అన్నాడు.

"ప్రయత్నిస్తే ఇంకో ఉద్యోగం దొరక్క పోదు."

ఇంతలో చంద్రం పరుగెత్తుకు వచ్చి, "అన్నయ్యా, టెలిగ్రాం వచ్చింది. ఇదిగో" అన్నాడు.

కమల ఆ టెలిగ్రాం చదువుకొని దిగ్భ్రాంతి చెందిపోయింది. సంతోషంతో మనస్సు ఓల లాడింది. "మీరు ఇండియన్ పోలీసు సర్వీసులో సెలక్టవయినట్లు వచ్చింది" అన్నది టెలిగ్రాం అందిస్తూ.

రవీంద్రుడు ఆ టెలిగ్రాం చదువుకొని అన్నాళ్లకు తన మనోరథం సిద్ధించినందుకు మనస్సులోనే పరవశమయ్యాడు.

కమల ఉత్సాహంగా, "చంద్రం, మీ అన్నయ్య ఇప్పుడు ఎవరో తెలుసా? పోలీస్ సూపరింటెండెంట్" అన్నది.

చంద్రం సంతోషంగా, "నిజంగానా! మామయ్యతో కూడా ఈ సంగతి చెప్తాను" అని టెలిగ్రాంతో సహా పరుగు లంకించు కున్నాడు.

కమలలో ఇప్పుడు ఏయే భావాలు మెదులు తున్నాయో ఊహించి చెప్పడం చాలా కష్టం. "ఈ విషయం నాతో ఎప్పుడూ చెప్పలేదేం?" అని అడిగింది.

"ఇప్పుడు తెలిసిందిగా?"

"మీ రిందుకేనా రాత్రంతా చదువుతుండే వారు?"

"ఆ!" ఇద్దరి మధ్య కొన్ని క్షణాలు నిశ్శబ్దం ఆవరించినది.

"ఆ ఉద్యోగానికి రాజీనామా ఇవ్వడంతో చాలా తొందరపడ్డామనుకుంటాను కమలా!"

"లేదు. ఉద్యోగం చెయ్యను. నేను లేడీ డాక్టర్నుకాను. నేను మీ భార్యను మాత్రమే" అన్నది.

"నీ హృదయం చాలా కోమలం కమలా!"

"కాదు కాదు. ఆనాడు మీరు అన్నట్లు స్త్రీ హృదయం కఠిన పాషాణం" అన్నది.

కమల దృష్టిని తన వైపుకు త్రిప్పుకొని "కోమలమని చెప్పటానికి ఇంతకన్నా వేరే నిదర్శన మక్కర్లేదు కమలా!" అన్నాడు కన్నీరు తుడుస్తూ.

హాలులో గోడ గడియారం టంగ్ మని గంట కొట్టింది. ★